విశాలాంధ్ర కృష్ణా జిల్లా

గ్రామాల్లో పాల కేంద్రాలను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా సంవత్సరానికి మూడు విడతలుగా అందజేసే పాల బోనస్, నగదు ప్రోత్సాహకాలను, సరఫరా చేసే దాణా, వైద్య పరీక్షలు తదితర అంశాలపై గ్రామాలలోని పాడి రైతులకు పేర్కొంటూ అవగాహన కల్పించి పాల కేంద్రాలకు అధిక పాలు సరఫరా చేయించి కేంద్రాల మనుగడను కాపాడుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. మొవ్వ మండలం కోళ్లపాలెం, పద్దారాయుడు తోట గ్రామాలలోని పాల ఉత్పత్తి కేంద్రాలను శనివారం పరిశీలించి రైతులతో ముచ్చటించారు. అదేవిధంగా క్షీరబంధు ద్వారా పాడి రైతు కుటుంబాలకి అందజేసే సహకారాలను కూడా ప్రస్తావిస్తూ వేరే కేంద్రాలకు పోస్తే ఈ విధమైన ప్రోత్సాహం ఉండదని, ప్రైవేట్ గా అమ్ముకునే వారికి కూడా సరఫరా చేయకుండా అత్యధిక వెన్న శాతం ధర అందించే విజయ డైరీ కేంద్రాలకే పాలు సరఫరా చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగారైతులసమస్యలను తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పామర్రు పాల శీతల కేంద్ర మేనేజర్ సిహెచ్ గోపీనాథ్, పాల కేంద్రం అధ్యక్షురాల్సైన తాతా నాగేశ్వరమ్మ, ఎం సంపూర్ణ, సూపర్వైజర్ బాషా, పాడి రైతులు పాల్గొన్నారు.

కోళ్లపందేలపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో నెలరోజుల్లో మొదలయ్యే కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించకుండా లా అండ్ లార్డర్. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని బందోబస్తు ఏర్పాటు చేయాలని గుడివాడ డీఎస్పీ పి శ్రీకాంత్ సూచించారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం సాయంత్రం సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి గ్రామంలో జరిగే పరిణామాలపై ముందస్తు సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అలాగే సెన్సిటివ్, హై పవర్ సెన్సిటివ్ గ్రామాలను గుర్తించాలని ఆ గ్రామాల్లోని పెద్దలకు పలు సూచనలు కూడా ఇచ్చి ఏ విధమైన అల్లర్లుజరగకుండా చూడాలని సూచించారు. ఇదే సందర్భంగా పోలీస్ స్టేషన్. పరిసరాలను పరిశీలించడంతోపాటు రికార్డులను తనిఖీ చేసి, కేసులు వాటి వివరాలను సేకరించి ముఖ్యమైన కేసులకు సూచనలు ఇచ్చారు. నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్.భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్‌కు ముందస్తు చర్యలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో మియాచుంగ్ తుఫాన్ నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర సచివాలయం నుండి మియాచుంగ్ తుఫాను ప్రభావిత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3, 4, 5 తేదీలలో మియా చుంగ్ తుఫాను ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా రైతులు పండించిన దాన్యం దెబ్బతినకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. ఇదివరకే వేటకు వెళ్లిన మత్స్యకారులను వెంటనే తిరిగి వెనక్కు రప్పించాలన్నారు. తుఫాను వలన విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయి రహదారులకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ లోని వారి చాంబర్ నుండి పి రాజాబాబు మాట్లాడుతూ మీయాచుంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని అధికారులందరినీ అప్రమత్తం చేసి అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 3.74 లక్షల ఎకరాల్లో వరి సాగు అయిందని దాదాపు పంట అంతా కోత దశకు వచ్చిందన్నారు. నిన్నటి వరకు 80,000 మెట్రిక్ టన్నుల దాన్యం కోత జరిగిందని, అందులో 35 వేల మెట్రిక్ టన్నులు ఇప్పటికే మిల్లులకు తరలించామని, ఇంకా 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు కోత కోసి ఆరబెట్టి ఉన్నారన్నారు. జిల్లాలో 7 మండలాల్లో తుఫాను ప్రభావం ఉంటుందని, అందులో 4 మండలాలు సముద్ర తీర ప్రాంతం లో ఉన్నాయని కలెక్టర్ వివరిస్తూ ఆ ప్రాంతాల్లోని 63 గ్రామాలలో మత్స్యకారులు ఉన్నారన్నారు. ఆ మండలాల్లో విస్తృతంగా అవగాహన కలిగించి వారు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా నియంత్రించామన్నారు. ఏ ఒక్కరు కూడా ప్రస్తుతం సముద్రంలోకి చేపల వేటకు వెళ్లలేదన్నారు. రెవెన్యూ ఉద్యోగులను కూడా ఆ గ్రామాలకు పంపించి వారికి ఆహారం, మంచినీరు వంటి సదుపాయం కల్పించామన్నారు. తుఫాను ప్రభావం వల్ల పడవలు దెబ్బ తినకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరిచేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా గజ ఈతగాళ్లను కూడా గుర్తించి సిద్ధంగా ఉంచుకున్నామన్నారు. తుఫాను సహాయ కార్యక్రమాల కోసం 2 కోట్ల రూపాయల నిధులను అవసరం ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి డిఆర్వో పెద్ది రోజా, భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త ఎస్.ప్రయేక్ పాల్గొన్నారు.

కంట్రోల్ విభాగం ఏర్పాటు

మియాచుంగ్ తుఫాను నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్లో 08672 252572 నంబర్‌కు కమాండ్ కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరైనా సరే సహాయం పొందుట కోసం ఆ నంబర్కు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు శనివారం ప్రకటనలో కోరారు.

నాగేశ్వరరావు జీవితం ఆదర్శం

విశాలాంధ్ర-చల్లపల్లి : అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా సహాయ కార్య దర్శి అడ్డాడ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు, భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి వక్కలగడ్డలో శనివారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడ్డాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసినఆయన రచయితగా, కళాకారునిగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, ప్రజా నాట్యమండలి నాయకుడిగా విశేష గుర్తింపు పొందారన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో క్రియా శీలకంగా పనిచేసి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసేవా రన్నారు. కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన ప్రతి ఉద్యమంలోనూ ముందుండి నడిచేవారని తెలిపారు. సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహించి స్వయంగా నటించారు. పౌరాణిక నాటకాల ఆర్గనైజర్ గా, మేకప్ మెన్ గా ఎంతో ఖ్యాతిని గడిచారని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి ద్వారా ఎందరో శిష్యు లను సమాజానికి అందించగా, వక్కలగడ్డ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు అడ్డాడ నాగేశ్వరరావు తండ్రి అడ్డాడ కోటేశ్వరరావు క్రియాశీలక భూమికను పోషించా రన్నారు. తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ఆయన అదే పంథాను కొనసాగించిన నాగేశ్వరరావు తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, ప్రజానాట్యమండలి నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. నాగేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి తరం కమ్యూనిస్టు నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సిపిఐ నాయకులు నక్క శ్రీనివాసరావు, సిద్ధాబత్తుల వాసు, వైఎస్ఆర్సిపి నాయకులు కేసనకుర్తి శరత్ బాబు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంలో 21 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాలలో రెండు రోజులు పాటు నిర్వహించే ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలలో భాగంగా తొలిరోజైన శనివారం పోలింగ్.కేంద్రస్థాయి అధికారులు చేర్పులు, మార్పులు, సవరణలు నిర్వహించారు. ఈ శిబిరాలను అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు సైతం పరిశీలించారు. అదేవిధంగా ఓట్లు తొలగించారనే ప్రచారాలు విస్తృతంగా ప్రసారమాధ్యమాల ద్వారా ఊపందుకోవడంతో వైయస్సార్సీపి, తెలుగుదేశం నాయకులు ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొవ్వ మండల తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సూపర్ వైజర్స్ గానున్నడిప్యూటీతాసిల్దార్ సిహెచ్ గోపాల రావు, ఆర్ ఐ ఈదేవిజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కొత్త ఓటర్ లో నమోదుపై ఆరా తీశారు. కాగా కూచిపూడి లోని మూడు కేంద్రాలలో ఓటరు నమోదుపై బి ఎల్ ఓ లు ఏ. రామ్.ఫణికుమార్, ఎం. ఖాసిం, పి. ఉమామహేశ్వరరావులను అధికార పార్టీ గ్రామ అధ్యక్షుడు లంకపల్లి సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకుడు వెంపటి గోపాలకృష్ణ తమ బృందాల తో కలిసి వెళ్లి పరిశీలించి సమాచారం తెలుసుకున్నారు.

పటిష్టంగా ధాన్యం కొనుగోళ్లు

విశాలాంధ్ర-మచిలీపట్నం : ధాన్యంతో కూడిన లోడు వాహనం రైస్ మిల్లుకు చేరుకున్న 6 గంటల్లోపు ఆ మొత్తాన్ని అన్లోడ్ చేసి తేమశాతం లెక్కించాలని,రైతులకు లబ్ధి చేకూరేలా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన ఛాంబర్ లో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా గృహ నిర్మాణం, ధాన్యం సేకరణ ప్రగతిపై క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్య సేకరణ విషయంలో గతేడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మరింత పటిష్టమైన విధానంతో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మొవ్వ, పామర్రు, నందివాడ తదితర మండలాల్లో వరి కోతలు పూర్తికాబడి రైతులు ధాన్యాన్ని రోడ్డు పక్కన ఆరబెట్టుకుంటున్నారని తెలిపారు. పండించిన ధాన్యం రైస్ మిల్లులకు చేర్చేందుకు జిల్లాలో మూడు డివిజన్లలో 748 జిపిఎస్ అమర్చిన వాహనాలు సిద్ధం చేశామని ఇందులో 472 వాహనాలు దాన్య సేకరణ పనుల్లో నిమగ్నమయ్యాయని, అలాగే 178 వాహనాలకు జిపిఎస్ సమస్య ఏర్పడిందని మరో 55 వాహనాలకు రాంగ్ ఫోన్ నెంబర్ సమస్య ఏర్పడిందని, ధాన్య సేకరణ కార్యక్రమంలో పాల్గొనకుండా ఉన్న వాహనాలు 43 ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జిపిఎస్ సమస్య సరిచేసి రాంగ్ ఫోన్ నెంబరు ఇబ్బంది చక్క దిద్దితే మరో 276 వాహనాలు పూర్తిస్థాయిలో ధాన్య సేకరణ పనుల్లో నిమగ్నమై ఉంటాయని కలెక్టర్ అన్నారు కొన్ని మండలాలకు వాహనాలు అందుబాటులో లేవని అధికారులు చెప్పగా, స్థానికంగా ఉన్న వాహనాలకు జీపీఎస్ అమర్చేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. రైతుల వద్ద నుంచి అన్‌లోడింగ్ చార్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ మిల్లర్లు వసూలు చేయకుండా కస్టోడియన్ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద వాహనం యజమాని, డ్రైవర్ మొబైల్ నెంబర్లు, చిరునామాలు ఉండాలన్నారు. రైతులు సచివాలయం వద్దకు వచ్చి ధాన్యం సిద్ధంగా ఉన్నాయని తెలిపిన వెంటనే అగ్రికల్చరల్ అసిస్టెంట్ ధాన్యం రవాణాకు సంబంధించిన వాహనాన్ని సిద్ధం చేసి మిల్లర్స్‌కు చేర్చే విధంగా వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా 2024 నాటికి ఇళ్ళ పూర్తి చేసేందుకు రూపొందించిన 4 దశల కార్యాచరణ ప్రణాళిక అమలు దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మొదటి దశలో 5 లక్షల ఇళ్లను విజయవంతంగా పూర్తి చేసామని రెండో దశ ఇండ్ల నిర్మాణాలు అదే ఉత్సాహంతో పనిచేయాలని కలెక్టర్ పి. రాజాబాబు సూచించారు. లక్ష్యాలను సాధించడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేందుకు 4 దశల్లో ప్రణాళిక సిద్ధం చేశామని డిసెంబర్ 1 నుంచి జనవరి 31 వరకు క్షేత్ర స్థాయి సందర్శన చేసి పనులు వేగవంతం చేయాలని హౌసింగ్, డ్వామా పిడి జీవి సూర్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు రూట్ మ్యాప్ సిద్ధం చేసి మండల పరిధిలోని అధికారులకు, సమన్వయ శాఖలకు లక్ష్యాల గురించి వివరాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

రైతుల గుండెల్లో రైళ్లు

విశాలాంధ్ర-కూచిపూడి : రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించకపోవడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆంధ్రప్రదేశ్.కు తుఫాను ముప్పుఉందంటూచేసిన వాతావరణ శాఖప్రకటనకి తోడుగా వాతావరణంలో మబ్బులు పట్టి గాలులు వీస్తుండటంతోయాంత్రికరణ ద్వారా వరి కోత కోసి నూర్చి కాటా వేసిన ధాన్యం ఇంచుమించుగాప్రతి గ్రామంలోనూ దర్శనమిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే లారీల కొరత కూడా ఉండటంతో పాటు కొత్తగా ఈ ఏడాదిలొకేషన్ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడంతో వారి పాట్లు వర్ణనాతీతం. ఆదివారం నుంచి వర్షాలు పడతాయని ప్రచారం ఉండటంతో రైతుల పాట్లు వర్ణనాతీతం!!. కూచిపూడి, భట్ల పెనుమర్రు, కోసూరు, పెదపూడి, యద్దనపూడి, అవురిపూడి, మంత్రి పాలెం, అయ్యంకి, నిడుమోలు తదితర ప్రాంతాలలో వేలాదిబస్తాలులోఎత్తి కొన్నిచోట్ల పరదాలు కప్పి, మరికొన్ని చోట్ల ఆరుబయట అలాగే ఉంచినపరిస్థితి శనివారం కనబడింది.

రైతులను ఆందోళన పెడుతున్న తుపాను హెచ్చరికలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల వాతావరణంలో పెనుమార్పులు రావడంతో వాతావరణ శాఖ అధికారులు మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని సూచనలు చేయడంతో పడవలన్నీ కృష్ణానది వద్దకు చేరుకున్నాయి. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు సంభవించి చదురుమొదురు జల్లులు పడుతూ ఉండటంతో ఒక ప్రక్క రైతులు ఆందోళన చెందుతుండగా, వాతావరణ శాఖ అధికారులు శనివారం రాత్రి నుండి వాతావరణంలో మార్పులు సంభవించి ఈదురుగాలులతో కూడిన వర్షం నమోదు అవుతుందని, 4 వ తేది సోమవారం మధ్యాహ్నం చెన్నై మచిలీపట్నాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో భారీ నుండి అతిభారీ వర్షాలు నమోదు అవుతాయని, మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గత వారం కురిసిన వర్షానికి దివిసీమలోని పలు ప్రాంతాల్లో చేతికి అందివచ్చిన పంట నేలబారుగా పడిపోవడంతో అన్నదాతలు ఇప్పటికే ఆందోళన చెందుతుండగా గోరుచుట్టుపై రోకలి పోటు లా ఆందోళనలో ఉన్న రైతాంగానికి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మారింది. నవంబర్ నెలలో దివిసీమకు తుఫానులు పుట్టిన పేరుగా పెద్దలు చెబుతున్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తం : రవికుమార్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- తుఫాన్ ప్రభావంతో విద్యుత్ వినియోగదారులు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని బంటుమిల్లి విద్యుత్ శాఖాధికారి రవికుమార్ శనివారం మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మియాచుంగ్ తుఫాన్ వలన వర్షాల, గాలులు, వల్ల రైతులకు సంబంధించిన కొందరివి కరెంట్ మోటార్లు మునిగి వుంటాయి మరియు స్టార్టర్స్, డబ్బాలు తడిసివుంటాయి.సర్వీసెస్ వైర్స్ డామేజెస్, అవుతాయి. స్తంబాలు పడిపోవచ్చు, వైర్స్ తెగిపోవచ్చు, కావున వాటిని ముట్టుకొనే ప్రయత్నం కాని, దగ్గరకు వెళ్లే ప్రయత్నం కాని చేయవద్దన్నారు. ఆక్వా రైతులు, ఏరియేటర్స్ ను ముట్టుకోన రాదు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే మీ ఇంటికి సంబందించిన సర్వీస్ వైర్లని కాని, వాటితో వెలాడే ఇనుప తీగలను కానీ, కరెంట్ స్తంభాలను కానీ,ఇనుప స్తంభాలను కానీ, లైన్స్ మీద చెట్టు కొమ్మలు పడిన కానీ, ముట్టుకొనే ప్రయత్నం చేయకండి. ఇంట్లో నుండి బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్త, వాహనాలలో వెళ్ళేటప్పుడు జాగ్రత్త, అలాగే తడిచేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోకండి. విద్యుత్ షాక్ తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దయచేసి విద్యుత్ షాక్ తో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడండి. ఏదైనా విద్యుత్ సమస్య వుంటే,తీగలు తెగి ఉన్న, పోల్స్ పడిపోయిన వెంటనే ,మీ లోకల్, లైనయిన్స్పెక్టర్ కు కానీ లైన్ మాన్ కు కానీ, సబ్ స్టేషన్స్ కు కానీ, ఎఇ దృష్టికి కానీ, 1912 కు కానీ తెలియపరచాలని ప్రజలకు విప్తి చేశారు.

రైతులకు పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో 20 సంవత్సరాలకు పూర్వం నుంచి అసైన్మెంట్ భూములను సాగు చేసుకుంటున్న 50 మందిరైతులకు పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పట్టాలు అందజేశారు. వీరి పేర్లను ప్రస్తుతమున్నఎస్.ఈ.సి 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తహసిల్దార్.పేర్కొన్నారు. దశాబ్దాల కాలం నుంచి సాగు చేసుకుంటున్న రైతులు పెదముత్తేవిలో17 మందికి, పెదసనగల్లులో 9 మందికి, నిడుమోలలో ఆరుగురికి, అయ్యంకిలో నలుగురికి, అవురుపూడి, చినముత్తేవిలో ఇద్దరు చొప్పున లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రసంగిస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వెల్లడించారు. పెదముత్తేవి దళితవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకర్ల శివకుమార్, ఎంపీటీసీ ఉప్పలపాటిజ్యోతి, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు

బావిలో పడి ఒకరి మృతి

విశాలాంధ్ర-పెడన: పట్టణంలో గూడూరు రోడ్డు లోని రైల్వే గేటు సమీపంలోని రామాలయం గుడి వెనకాల బావిలో పడి వ్యక్తి మృతి చెందారు. శనివారం ఉదయం మంచినీటి బావిలో మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు సిబ్బందితో స్థానిక మూడో వార్డుకు చెందిన బట్ట సుధాకర్ గా గుర్తించారు పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

నేటి నుంచి అగ్రిటెక్ వ్యవసాయ సదస్సు



విశాలాంధ్ర-ఘంటశాల: ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు నందు అగ్రిటెక్ 2023 వ్యవసాయ సదస్సు డిసెంబర్ 03 నుంచి 05 వరకు మండల కేంద్రమైన ఘంటశాల కె.వి.కె.లో నిర్వహించటం జరుగుతుందనీ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. పి. శ్రీలత పేర్కొన్నారు. డా. శ్రీలత మాట్లాడుతూ ఈ సదస్సులో వివిద పంట లతో నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్‌లు, మెట్ట వ్యవసాయంలో నూతన యాజమాన్య పద్ధతులు పాడి, చేపలు, ఉద్యాన పంటల లో నూతన యాజమాన్య పద్ధతులు, సూక్ష్మ నీటి వినియోగం, రైతు శాస్త్రవేత్తల ముఖాముఖి ఇష్టాగోష్టి ఉం టుందన్నారు. అలాగే ప్రవేటు కంపెనీల ప్రదర్శన, ఔత్సాహికుల నూతన ఆవిష్కర ణలు, యువతకు వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు పై సదస్సులో వివరిస్తారని అన్నారు. అంతేకాక ప్రచురణలు, రైతు సంఘాలు, సేంద్రియ వ్యవసాయ విధానాలు, వ్యవసాయంపై అవగాహన ఇస్తారన్నారు.

ప్రకటన

నా క్లయింటు కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామ కాపురస్థులైన సువర్ణ చంద్రహాస్ గారి కుమారుడు దొండపాటి సాల్మన్ రాజు గారు నాకు యిచ్చిన సంటాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

నా క్లయింటు తండ్రి గారైన దొండపాటి సువర్ణ చంద్రహాస్ గారికి బాపులపాడు గ్రామం నందు ఆర్.యస్.నెం.133/2 రు దాఖలా య.0.10సెం నివేశ స్థలమును గూడవల్లి మధుసూదనరావు గారి కుమారుడు రంగారావు గారి వద్ద క్రయము పొంది దస్తావేజు నెం.1428/1985 గా హనుమాన్ జంక్షన్ సబ్-రిజిస్ట్రార్ వారి కార్యాలయములో రిజిస్టర్ చేయించియున్నారు. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు మరియు నా క్లయింటు యొక్క బి.ఎస్.సి (Reg.No.11522) Nagarjuna University 1985 మరియు బి.ఇ.డి (Reg No.546) Andhra University 1987 ఒరిజినల్ డిగ్రీ పట్టాలు మరియు నా క్లయింటు తండ్రి గారైన దొండపాటి సువర్ణ చంద్రహాస్ గారు ది.14-11-1995 న వ్రాయించి ఇచ్చిన Unregistered Will ఒరిజినల్ ను కవర్‌లో పెట్టుకుని గన్నవరం బ్యాంకు లాయర్ వద్దకు వెళ్ళగా ది.25-11-2023 న పోయినవి. సదరు గన్నవరం వెంకటేశ్వరరావు థియేటర్ సెంటర్‌లో చూసుకొనగా కవర్‌లో పెట్టుకున్న ఒరిజినల్ దస్తావేజు, ఒరిజినల్ డిగ్రీ పట్టాలు మరియు Unregistered Will ఒరిజినల్ ను పోగొట్టుకొనటమైనది చుట్టుప్రక్కల వారిని విచారించిన దొరకలేదు ఎవ్వరికైనా దొరికినచో ఈ దిగువ అడ్రస్ కు తెలియపర్చినచో తగిన పారితోషికం ఇవ్వబడును.

సం॥ సిహెచ్. అంజయ్య, న్యాయవాది/నోటరి
డోర్ నెం.8/66/1, గన్నవరం గ్రామం & మండలం,
కృష్ణా జిల్లా. సెల్: 8985670762

ప్రదేశం: గన్నవరం
తేది:02-12-2023

ధాన్యం వెనక్కి పంపిన మిల్లర్లు-రోడ్డుపై పోసి ధర్నా

విశాలాంధ్ర-కూచిపూడి : తేమ శాతం ఎక్కువగా ఉందంటూ మిల్లరుతిప్పి పంపిన ధాన్యాన్ని రైతు రోడ్డుపై పోసి నిరసన దీక్ష చేపట్టిన సంఘటన అయ్యంకిలో శనివారం ఉదయం జరిగింది. దీనితో ట్రాఫిక్ ఆగిపోవడంతో సమాచారం తెలుసుకున్న కూచిపూడి ఎస్సై డి సందీప్ రైతులతో మాట్లాడి తహశీల్దార్ దగ్గరికి పంపించటంతో తాత్కాలికంగా సమస్యసద్దుమణిగింది. పాఠకులు వివరాల్లోకి వెళితే.... బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మొవ్వ మండలం అయ్యంకి గ్రామం నుంచి రాజులపాటి రాంబాబు అనే రైతు లారీ లోడు ధాన్యాన్ని గతనెల 23వ తారీఖున ఆన్లైన్లో నమోదు చేసుకుని ఘంటసాల మండలం చిట్టూర్పులోని శ్రీ లక్ష్మీ రైస్ మిల్లు కి సరఫరా చేశాడు. తక్కువ ధరకు తీసుకోమని బతిమాలాడినా అంగీకరించకపోవడం తో చేసేదేమీ లేక లారీని కిరాయికి మాట్లాడుకుని శుక్రవారం మిల్లరు తిరస్కరించిన ధాన్యాన్ని తన స్వగ్రామం తెచ్చుకున్నాని చెప్పాడు ఆరుకాలం శ్రమపడి వేలాది రూపాయలు వెచ్చించి పండించిన పంటను ఏమి చేయాలో తెలియక శనివారం ఉదయం అయ్యంకిలోని చెక్ పోస్ట్ సమీపంలో ప్రధాన రహదారిపై పోసి ధర్నాకు దిగాడు. అరగంట ధర్నాతో రాకపోకలు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో సమాచారం తెలుసుకున్న కూచిపూడి ఎస్సై డి సందీప్. హుటాహుటిన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి రైతుతో మాట్లాడారు. ఈ దశలో రైతు తమ మొండి పట్టు విడవకపోవడంతో తహశీల్దార్ కి ఫిర్యాదు చేసుకోవాలని సూచించి ధాన్యాన్ని రోడ్డుపై నుంచి తొలగించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కారు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తృటిలో తప్పుకున్నారు. మండల పరిధిలోని వేకనూరు సూర్యనారాయణ స్వామి వారి దేవస్థాన సమీపంలో అవనిగడ్డ నుండి నాగాయలంక వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు డ్రైవర్ ప్రక్కన ఉన్న వ్యక్తి నాకు కూడా డ్రైవింగ్ నేర్పించమని అడగటంతో డ్రైవర్ సహకారంతో స్టీరింగ్ అందుకున్న వ్యక్తి చేతులో మరుక్షణమే కారు మురుగు కాలువలోనికి శనివారం ఉదయం దూసుకువెళ్ళింది. అయితే ప్రమాదంలో ఎవరికి ఏ విధమైన ప్రమాదం ఏమీ జరగకుండా సురక్షితంగా బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తం

విశాలాంధ్ర పెదపారుపూడి : కోస్తాంధ్ర వైపు దూసుకొస్తున్న మిచౌంగ్ తుఫాన్ ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్రంగా మారే అవకాశం ఉన్నందున మండలంలోని రైతులు మిషన్ల ద్వారా కోసిన వరి ధాన్యమును జాగ్రత్త చేసుకోవాలని అలాగే మనుషులతో వరి కోత కోసిన పనలను ఒక చోటుకు చేర్చుకుని టార్పన్లతో కప్పుకొని జాగ్రత్త చేసుకోవాలని మండల తహసీల్దార్ వి నాగభూషణం రైతులకు శనివారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని సంచులలో పట్టించి ఆన్లైన్ ద్వారా సంబంధిత మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని అందుకు గ్రామ విఆర్వోలు మీకు అందుబాటులో ఉంటారని అన్నారు. వరి కోత కోయని రైతులు తుఫాన్ కదలికలు వర్షాభావ ప్రభావాలు చూసుకొని పనులు మొదలు పెట్టాలని అన్నారు. ఏది ఏమైనా రైతుకు ఇబ్బంది కలగకుండా, నష్టం కలగకుండా ఎప్పటికప్పుడు వీఆర్వోలు రైతులకు అందుబాటులో ఉంటూ కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా సహకరించాలని తహసిల్దార్ రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో తుఫాను తీవ్రం దాల్చితే గాలి వాన వచ్చే అవకాశం ఉన్నట్లయితే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఆయా గ్రామాలలో విఆర్వోలు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ఆరాధిస్తూ ఉండాలని రెవెన్యూ సిబ్బందికి తహసిల్దార్ సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

విశాలాంధ్ర-ఘంటశాల: ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనలు సధలించి రైతులను ఆదుకోవాలనీ ఘంటశాల రైతు గొర్రెపాటి వెంకటనరసింహారావు శనివారం ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మిచాంగ్ సైక్లోనిక్ తుఫాన్ ముంచుకొస్తుందనీ, మచిలీపట్నానికి 800 కి.మీ. దూరంలో ఉండటంతో రైతుల ఆరుగాలం పండించిన పంట చేతికి రాదేమోననీ, ఆందోళనలో రైతులు గుండె గుప్పెట్లో పెట్టుకుని ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్ వారు తుఫాన్ ముంచుకొస్తుందనీ, రైతులు ధాన్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలనీ చెబుతున్నారన్నారు. రైతులు ఎన్ని ఇబ్బందులు పడినా ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు పంపే విషయంలో ఎంతో జాగ్రత్తగానే ఉంటున్నామన్నారు. అయితే ధాన్యాన్ని కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రభుత్వం చెప్పిన ప్రకారం 6 గం॥ లోపే దిగుమతి చేసుకోవాలన్నారు. కానీ ఈ రోజు వెళ్ళిన ధాన్యం వాహనం రెండోరోజు సాయంత్రానికి గానీ రావటంలేదన్నారు. ఇలా మిల్లర్లు చేయటంతో వాహనదారులు రైతులతో మాకు కిరాయి సరిపోతు ఎక్కువ ఇవ్వాలనీ కోరుతున్నారనీ, అసలే రైతుల పరిస్థితే అంతంత మాత్రాన ఉంటే మూలిగే నక్క పై తాడిపండు పడినట్లుగా ఉందన్నారు. అలాగే ఘంటశాల రైతుల ధాన్యాన్ని ఘంటశాల, చల్లపల్లి ,కొడాలి పరిసర ప్రాంతాల మిల్లుల్లోనే దాన్యాన్ని దిగుమతి చేసుకోవాలనీ, ఘంటశాల రైతుల ధాన్యం కోడూరు, నాగాయలంక, మోపిదేవి మిల్లులకు పంపి, అక్కడ రైతుల ధాన్యాన్ని ఇక్కడకు పంపే కంటే ఎక్కడి ధాన్యాన్నిఅక్కడ పరిసర ప్రాంతాల్లోని మిల్లులకు కొనుగోలు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ఒక ప్రక్క మిచాంగ్ సైక్లొనిక్ తుఫాన్ ముంచుకొస్తుంటే తేమ శాతం 20 శాతం లోపే ఉండాలనీ మిల్లర్లు నిబంధనలు పెడుతున్నారనీ, ఈ నిబంధనలను రైతు భరోసా కేంద్రం వారు సధలించి దేశానికి అన్నం పెట్టే రైతున్నలను ఆదుకోవాలనీ రైతు కంట కన్నీరు దేశానికి, రాష్ట్రానికి అరిష్టం అని దేశానికి గుప్పెడు అన్నం పెట్టే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనీ రైతు గొర్రెపాటి వెంకటనరసింహారావు కోరారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతు సంఘం జిల్లా కన్వీనర్ మల్నీడి యలమందరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రైతు సంఘం కన్వీనర్ మల్నీడి యలమందరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి పిలుపుమేరకు ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ శనివారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని కోటికలపూడి, దాములూరు, కేతనకొండ గ్రామాలలో ధర్నాలు మరియు గ్రామ కార్యదర్శులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా యలమందరావు మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాలలో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం732.21 మి మీటర్ లు గా నమోదు కావాల్సి ఉండగా, కేవలం 614.41గా మాత్రమే అతి తక్కువగా నమోదు అయిందని, ఆగస్టు నుండి నాలుగు నెలలు సెప్టెంబర్ వరకు అసలు వర్షాలే పడలేదని అన్నారు. దీంతో జిల్లా మొత్తం దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రభుత్వం గంపలగూడెం, తిరువూరు మండలాల్ని మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి జిల్లాలో అతి తక్కువ వర్షపాతం సైతం నమోదైన మిగతా మండలాలను పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. జిల్లాలోని 14 మండలాలను సైతం కరువు మండలాలుగా ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, 40 వేల మందికి కౌలు కార్డులు ఇచ్చినట్లు ప్రకటిస్తున్నా, ఏ ఒక్కరికి పంట రుణాలు అందలేదని, గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ తక్షణమే బ్యాంకుల ద్వారా రుణాలు అందజేయాలని కూడా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఖరీఫ్ లో ఇచ్చిన పంట రుణాలను రద్దుచేసి మరల కొత్త రుణాలు ఇవ్వాలని, వాస్తవ సాగుదారులైన రైతులను గుర్తించి పంట నష్టపరిహారం కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ కోటేశ్వరరావు, హరికృష్ణ, బాబురావు, నరసింహారావు, గోవిందరావు, అర్జునరావు, శ్రీను, మౌలాలి, సైదా, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు

విశాలాంధ్ర-నందిగామ: ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కో కన్వీనర్ చుండూరి సుబ్బారావు శనివారం డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి ఖర్చుపెట్టి పంటలు సాగుచేస్తే వరుణుడు కరుణించక వర్షాలు కురవక తక్కువగా వర్షాలు పడ్డాయని నీరులేక వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని ఎండిపోతున్నాయని, ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాలని బ్యాంక్ నుండి తీసుకున్న రుణాలు రద్దుచేయాలని. తిరిగి రుణాలు మంజూరు చేయాలని సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి పంటల నష్ట పరిహారం వారికే ఇవ్వాలని అలాగే వ్యవసాయ పనులులేని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి, రూ.600 కూలి ఇచ్చి 200 రోజులు పనిదినాలు కల్పించి వ్యవసాయ. కూలీలను ఆదుకోవాలని ఆయన కోరారు. రైతులకు రబీలో సీజన్లో అవసరమైన ఎరువులు విత్తనాలు పురుగుమందులు. పంటరుణాలు ప్రభుత్వమే అందించాలని కరువుతో అల్లాడుతున్న గ్రామీణ పేదలకు పెన్షన్లు, ఆరు నెలలు నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. పంటల భీమా పథకం అమలుచేసి రైతులను కౌలు రైతులను సన్న, చిన్నకారు రైతులను ఆదుకొని వ్యవసాయాన్ని కాపాడాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మవారిపాలెం రాఘవపురం రామిరెడ్డిపల్లి ఆయా గ్రామాల రైతులతో కలసిఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్ట చామంతి, నందిగామ మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, జంపాని సుబ్బారావు, బి రవి, నరసింహారావు, గోపి,ఏలూరు వెంకటరమణ, అబ్బూరు రమణ, అంగడాల రామకృష్ణ, బి రత్తయ్య, ఎస్.కె నాగులమీరా, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల రైతులు వర్షా భావంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నష్టపరిహారం అందించాలని సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి డిమాండ్ చేశారు. శనివారం అంబోజి శివాజీ. సీపీఐ బృందంతో కలసి పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పెనుగంచి ప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు సచివాలయ కార్యాలయాల్లో కార్య దర్శులు జి.శ్యామ్‌కుమార్. టి.వీరభద్రరావు, వేణులకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రాహ్మం మాజీ ఎంపీపీ, సీపీఐ నాయకులు పొన్నం నరసింహారావులు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుందని అధికార ప్రభుత్వ యంత్రాంగం రైతే దేశానికి వెన్నుముక అని రైతుల కోసం ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటూ దేశానికి వెన్నుదన్నుగా నిలబడుతున్న రైతునడ్డి విరగగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం, పంట కాలువ ఆధారిత రైతులు ప్రత్తి, మిర్చి పంటలు నష్టపోయి లబోదిబోఅంటున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సబబు కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉధృతస్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కనకపూడి బాబురావు, రైతు సంఘ నాయకులు చాగంటి రామకృష్ణ, జక్కులూరి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి పుల్లయ్య, కటారపు కన్నయ్య, గద్దం శ్రీనివాసరరావు, ఏఐటీయూసీ నాయకుడు, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మకుడు జిల్లే పల్లి. జిన్నా. తదితరులు పాల్గొన్నారు.

పస్తులతో ఉన్నా పట్టించుకోరా...

విశాలాంధ్ర-ఎ కొండూరు : వరి, పత్తి, మిరప, కంది, మొక్కజొన్న వేరుశనగ, పసుపు పంటలు పండించినా రైతులు గిట్టుబాటు దరలేక పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక, అందినకాడికి అప్పులుతెచ్చి అప్పులు తీర్చే దారిలేక ఆకలితో అలమటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, అప్పులతో సతమతమవుతున్న ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతుసంఘం సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ డిమాండ్ చేశారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని పిలుపులో భాగంగా ఎ కొండూరు మండలం గొల్లమండల సచివాలయం వద్ద రైతులతో కలిచి శనివారం ధర్నా చేశారు. ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చీడ పీడలను తట్టుకొని పంటలు పండిస్తే వాటిని అమ్మాలంటే ప్రభుత్వం కొనుగోలు చేయటం లేదని తగిన గిట్టుబాటు కొరకు దళారులను ఆశ్రయిస్తే నిట్టానిలువునా ముంచుతున్నారని ప్రభుత్వం వెంటనే కలుగజేసుకుని దళారీ వ్యవస్థను అరికట్టాలని ఆయన కోరారు. సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ. ఒక పక్కన రైతులు అప్పులు తీర్చలేక అల్లాడుతుంటే మరోప్రక్క వ్యవసాయ కూలీలు చేద్దామంటే పనులులేక తిండికి జరగక పస్తులుంటు న్నారని వారికీ తిండైనా పెట్టండి లేక పనైనా చూపండి అదీ చేతకాకపోతే కరువు బత్తేమ్ ఇవ్వాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు జరిగివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఇప్పటికైనా పస్తులు నిలువరించాలంటే వ్యవసాయ కూలీలకు పనులుకల్పించి రోజుకూలీ 600 రూపాయలు ఇవ్వాలని సంవత్సరానికి 200.పనిదినాలు కల్పించి ఆదుకోవాలని అయన కోరారు. పంటలతో నష్ట పోయిన రైతులకు పాత రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలని. పంటల భీమా పథకం సక్రమంగా అమలుచేయాలని.కౌలు రైతులకు భూ యజమా నితో సంబంధం లేకుండా నష్ట పరిహారం కౌలు రైతుకు అందివ్వాలని.గ్రామీణ పేదలందరికి కరువు పెన్షన్ లు ఇచ్చి పస్తులతో జీవితాలను భారంగా అనుభవిస్తున్న వారందరికీ 6 నెలల పాటు నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని డేవిడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఉమ్మడి సుశీల.కె వెంకటేశ్వరావు ఎస్.కె.మస్తాన. కోలా లక్ష్మీకాంతమ్మ.మేకల మోషే. ఎస్ కె. కరీముల్లా.తెల్లూరి సంగీతరావు. జె సోమయ్య కె. లక్ష్మయ్య. ఎమ్. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

క్రీడాకారులకు క్రీడా సామాగ్రి, దుస్తులు, రవాణా ఛార్జీలు ప్రభుత్వమే భరించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాల్లో బాగంగా క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా సామాగ్రి, దుస్తులు, రవాణా చార్జీలు మొత్తం కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా యువకుల గురించీ క్రీడల గురించీ గుర్తుకు రాని రాష్ట్ర ప్రభుత్వం నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యువకుల ఓట్ల కోసం క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం కోసమే క్రీడా సంబరాల పేరుతో క్రికెట్ బాల్, బ్యాట్, వికెట్లు మీద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలను ముద్రించి ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతీ ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచారం కోసమే ఉపయోగించుకోవడం సరికాదన్నారు. క్రీడా సంబరాల్లో పాల్గొనే ప్రతి టీమ్‌కి ప్రోత్సాహక బహుమతులు అందజేయాలని కోరారు.

పింఛన్ పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వృద్ధులకు, వితంతువులు, చేనేత, గీత, మత్స, ఒంటరి మహిళల, కళాకారుల సామాజిక పెన్షన్ పెంచాలని మహిళా సమైఖ్య నాయకురాలు బంక ఝాన్సీ అన్నారు. శనివారం విజయవాడ 53వ డివిజన్‌లోని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో సామాజిక పెన్షన్ పెంపుదలకు వ్యక్తిగత దరఖాస్తుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులు, చేనేత, గీత, మత్స ఒంటరి మహిళల, కళాకారులకు నెలకు రూ.2750 నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. విభిన్న ప్రతిభాంతులు లేని వికలాంగులకు నెలకు రూ.3వేలు నుంచి రూ.7వేల వరకు పెంచాలన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): టీడీపీ నేత అధినేత చంద్ర బాబు నాయుడు దంపతులు విజయ వాడ కనకదుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. చంద్రబాబు సతీ సమేతంగా ఇంద్రకీలాద్రి పై అమ్మ వారి దర్శనానికి వచ్చారు. ఆలయ ముఖ ద్వారం వద్ద మేళతాళాలతో వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు చంద్రబాబు నాయుడు దంపతులకు అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ఎన్ని దుష్ట శక్తులనైనా ప్రతిఘటిస్తూ , ముందుకెళ్తానన్నారు. తెలుగు ప్రజానీకానికి సేవ చేసి రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చే శక్తి ప్రసాదించాలని దుర్గమ్మను వేడుకున్నట్లు తెలిపారు. ఎంపీ కేశినేని నాని, జనసేన నేత పోతిన వెంకట మహేష్, పంచుమర్తి అనురాధ, ఆశోక్‌బాబు, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమా, మాగంటి బాబు, బుద్దా వెంకన్న, ఎంఎస్ బేగ్‌లు స్వాగతం పలికారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట రూరల్ : జగ్గయ్యపేట నియోజకవర్గం మూడు మండలాల రైతులు వర్షా భావంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నష్ట పరిహారం అందించాలని నియోజకవర్గ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. బలుసుపాడు మరియు చిల్లకలు గ్రామ సచివాలయ కార్యాలయాల్లో కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుందని అధికార ప్రభుత్వ యంత్రాంగం రైతే దేశానికి వెన్నుముక అని రైతుల కోసం ఎంతో చేశామని గొప్పలు చెప్పు కుంటూ దేశానికి వెన్నుదన్నుగా నిలబడుతున్న రైతు నడ్డి విరగగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు వర్షం,పంట కాలువ ఆధారిత రైతులు ప్రత్తి,మిర్చి పంటలు నష్టపోయి లబోదిబో అంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నామ మాత్రంగా కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సబబు కాదని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోకపోయినట్లయితే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉధృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు జగ్గయ్యపేట పట్టణ సహాయ కార్యదర్శి మహమ్మద్ అసుదుల్లా సీనియర్ సిపిఐ పార్టీ నాయకులు భోగ్యం నాగులు గ్రామ రైతులు మారుతి గురవయ్య తిరపతిరావు చిల్లకల్లు, బలుసుపాడు గ్రామ రైతులు మహిళలు పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మియాచౌంగ్ తుఫాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. వాతావరణ శాఖ ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు అందుబాటులో ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్‌లో 0855-2575833 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్, మండల హెడ్ క్వార్టర్స్‌లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయటంతో పాటు 24 గంటలు విదులు నిర్వహించేలా అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

పొందుగుల మహిళల శక్తి సామర్థ్యాలు స్ఫూర్తి దాయకం

పొందుగుల గ్రామ సమాఖ్య మహిళల సంఘటిత శక్తి, సామర్థ్యం, ఐక్యత స్ఫూర్తి దాయకమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంలో పొందుగల గ్రామంలో సమాఖ్య మహిళలు ఇంటింటికి కుళాయి పనులు విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమాఖ్య సభ్యులను కలెక్టర్ శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందుగల మహిళల శక్తి, సామర్థ్యాలు ప్రతి మహిళకు ఆదర్శనీయంగా నిలుస్తాయని, సంఘటితంగా ఉంటే సాధించలేనిది ఏమీ ఉండదని నిరూపొంచారన్నారు. కహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోన్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవటంలో పొందుగల గ్రామ సమాఖ్య సభ్యులు చూపిన చొరవ, శక్తి, సామర్థ్యాలు రాష్ట్రంలోని స్వయం సహాయ బృందాల మహిళలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులైన బీ.ఆదిలక్ష్మీ, ఏ.ఉమారాణి, బీ.ఎలిజబెత్ రాణి, జీ.వెంకటేశ్వర్మ, జీ.బన్నీలను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ కే.శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ డీ.వెంకటరమణ, జిల్లా సహకార అదికారి సీహెచ్.శైలజ, ఏపీఎం ఎం.శామ్యూల్, ఐబీ పవన్‌జ్యోతి పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉద్యమ యోజన క్లీనింగ్ యంత్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పరిసరాల పరిశుభ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో జిల్లా స్వచ్ఛత ఉద్యమి యోజన కింద స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 మురుగు శుద్ధి వాహనాలను శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శనివారం ప్రారంభించారు. ఒక్కొక్క వాహనానికి ఐదుగురు లబ్ధిదారులు ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, కౌన్సిల్ మరియు కోఆప్షన్ సభ్యులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకై సచివాలయాలు : సామినేని

విశాలాంధ్ర-వత్సవాయి : 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనను అక్షరాల అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రభుత్వమేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు శనివారం మండలంలోని మక్కపేట గ్రామం నందు 43 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలను ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులను నియమించి ప్రజల ముంగిటికే పాలనను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనగాల రమేష్ కొమరగిరి భరద్వాజ్ శర్మ గ్రామ సర్పంచ్ గుడేటి సారమ్మసొసైటీ మండల ఎంపీపీ కొలుసు రమాదేవి జడ్పిటిసి సభ్యురాలు ఏసు పోగు దేవమని మండల పార్టీ అధ్యక్షులు గుత్త శంకర్రావు వెంకట బ్రహ్మంఎంపీటీసీ ఆళ్ళ కుమారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ఓటర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-గంపలగూడెం : జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపుల్లో భాగంగా శనివారం కలెక్టర్ ఢిల్లీ రావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ రెండు ,మూడు తేదీల్లో ప్రత్యేక పోలింగ్ శిబిరాలు ఏర్పాటు చేసి, బిఎల్వోలతో ఓటర్ల జాబితాలో సవరణలు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను బలోపేతమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థని బలోపేతం చేయడం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, అధికారుల సమిష్టి లక్ష్యం కావాలని ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తీర్ణతా శాతం పెంచదానికి విద్యా ప్రమాణాలు అభివృద్ధి చేయదానికి ఒక చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి ప్రతాపరెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంఘ అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను ఆధ్వర్యంలో రూపొందించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్ (మోడల్ పేపర్) ఆవిష్కరణ సభ నిర్వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ డెమొక్రటిక్ పిఆర్టియు,ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సంవత్సరం పదవ తరగతి స్టడీ మెటీరియల్ రూపొందించి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ల రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఆదూరి వెంకటరత్నం. డెమొక్రటిక్ పిఆర్టియు నాయకులు జీవీఎస్ పెరుమాళు ్, మర్రి ప్రభాకర్, ఈ వెంకట్ రెడ్డి,ఎంవీఎస్ నాగేంద్ర, శిరీష నాగిని, జోజయ్య,పి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అమ్రిత సాయి కళాశాలలో ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్స్

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్ తెలిపారు. శనివారం సీనియర్ విద్యార్థులు ప్రధమ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ దే కార్యక్రమాలను కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భం గా ముందుగా కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుభాభి నందనలు తెలిపారు. ఇంజనీరింగ్ చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే , మంచి ప్రణాళిక తో పాటు లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని , దానికి అనుగుణంగా నిరంతరం కృషి చేయాలనీ తెలిపారు. విద్యార్థిని , విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలను, నాటికలను, పలు చలన చిత్రాల గీతాలను , పాటలను ఆలపించి ప్రదర్శించారు. ముఖ్యంగా రీమిక్స్ సాంగ్స్ కు విద్యార్థులు ఉత్సాహం తో కేరింతల తో స్టెప్స్ వేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి చిరంజీవి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకు లు, విద్యార్థిని , విద్యార్థులు పాల్గొన్నారు.

భారతి ఆయుర్వేద శాల అధినేత హేమసుందర్ మృతి

విశాలాంధ్ర-విజయవాడ (తిరువూరు): భారతి ఆయుర్వేద శాల అధినేత, మాజీ విశాలాంధ్ర రిపోర్టర్ హేమ సుందర్ గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు గుండె పోటుతో రావడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మరణించారు. విశాలాంధ్ర దినపత్రికలో ఎంతో నిబద్ధతతో పనిచేసిన హేమసుందర్ పని చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్‌మీరా, తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్‌లు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళా సాధికారతకు రోటరీ అగ్రపీఠం : రావూరి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గోల్డెన్ ఆర్. మెక్నల్లి పిలుపు మేరకు ఈ సంవత్సరం అట్టడుగు వర్గాల మహిళా సాధికారితకు, బాలికల అభ్యున్నతికి పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ డిస్ట్రిక్ట్ గవర్నర్, రోట్యన్ రావూరి సుబ్బారావు (దత్తా) అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ 81వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం గుణదల ఇయస్ ఐ హాస్పిటల్ రోడ్డులోని పింగళి వెంకయ్య రోటరీ ప్లాటినం జూబిలీ సెంటర్లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోటరీ ఫౌండేషన్కు సేవలందించటానికి 12.75 లక్షలు, పోలియో నిర్మూలనకు 5 లక్షలు అందచేయటం జరిగిందన్నారు. అంతకు ముందు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ డిస్ట్రిక్ట్ గవర్నర్, సభ్యులు నున్నలోని గుడ్న్యూస్ మినిస్ట్రీస్ సేవాసంస్థ భవన్లో నిర్మాణదశలో ఉన్న 'రోటరీ ఐ కేర్' సెంటర్ను సందర్శించి, వృద్ధాశ్రమంలో వున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పింగళి వెంకయ్య రోటరీ జూబిలీ సెంటర్ లక్ష రూపాయలు విలువచేసే కుట్టు మిషన్లు, స్కాలర్షిప్లు, సైకిళ్ళు, అనాధ ఆశ్రమాలకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, న్యాయవాది కరిణి చంటిరాజు, సెక్రటరీ రాము, కోశాధికారి రామ్ గోపాలరావు, అసిస్టెంట్ గవర్నర్ పింగళి పిళ్ళా మోహనరావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్లు డాక్టర్ పట్టాభిరామయ్య, డాక్టర్ యంసి దాస్, డాక్టర్ మోహన్ ప్రసాద్, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభను జయప్రదం చేయండి : పొన్నం

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2. గంటలకు పెనుగంచిప్రోలులోని సీపీఐ కార్యాలయం (కర్ల లింగయ్య కళాభవన్) లో జగ్గయ్యపేట నియోజకవర్గం రైతు సంఘం మహాసభ జరుగుతుందని, ఈ సభకు రైతులు సకాలంలో హాజరై ఈ మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘ నాయకులు మాజీ ఎంపీపీ పొన్నం నరసింహారావు రైతులకు పిలుపునిచ్చారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-వీరులపాడు: ఈనెల 20వ తేదీ నుండి సమ్మె చేపడుతున్నట్లు వీరులపాడు మండల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు మండల ఎంఈఓ కెన్నెడీ కి శనివారం వినతిపత్రం అందజేశారు. ఒప్పంద ఉద్యోగుల సమ స్యల పరిష్కారం కొరకు ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్ష అభియాన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) పిలుపుమేరకు డిసెంబర్ 4వ తేదీన ఆవేదన దీక్ష, మరియు డిసెంబర్ 11వ తారీఖున చలో విజయవాడ కార్యక్రమం మరియు 20వ తేదీనుండి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల అకౌంటెంట్, మెసెంజర్,సీఆర్పీలు, ఐఈఆర్టీఎస్ లు, పి టి ఐ లు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

బొల్లెపోగు అశోక్, డో.నెం.2-215, అర్లపాడు (గ్రామం) గంపలగూడెం (మండలం), ఎన్.టి.ఆర్. (జిల్లా) అను నేను పాస్‌పోర్ట్ నెం.**R3017217** ఈ నెల **24-11-2023**న, అర్లపాడు నుంచి మెయిన్‌రోడ్డులో గంపలగూడెం వస్తుండగా, మార్గమధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోగొట్టుకున్నాను, ఎవరికైనా దొరికిన యెడల సహృదయంతో నాకు సమాచారం ఇస్తారని ఆశిస్తున్నాను.

బొల్లెపోగు అశోక్, డో.నెం.2-215, అర్లపాడు మెయిన్ రోడ్డు, గంపలగూడెం (మండలం), ఎన్.టి.ఆర్. జిల్లా. సెల్ : 9948894114.

చెన్నైస్ అమిర్త ఇంటర్నేషనల్స్‌లో ఫ్రూట్ మిక్సింగ్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : చెన్నైస్ అమిర్త ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాలలో క్రిస్మస్ సందర్భంగా ఫ్రూట్ మిక్సింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు ,క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా డ్రై ఫ్రూట్స్ తో చేసిన కేకును అందించడ%శీ% ప్రత్యేకత, ఇందులో భాగంగానే నగరంలోని చెన్నైస్ అమిర్త కళాశాల విద్యార్థులు వివిధ రకాలైన డ్రై ఫ్రూట్స్ తో మిక్సింగ్ చేసి కేకును తయారు చేస్తారు ఇందులో భాగంగా మిక్సింగ్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధ్యాపకులతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రాండ్ విజయవాడ బై జీఆర్టీ జనరల్ మేనేజర్ మిస్టర్ హరిప్రసాద్, హెచ్ ఆర్ మేనేజర్ మిస్టర్ వాసుదేవ్ ,అండ్ అసిస్టెంట్ హెచ్ ఆర్ ఎస్ ప్రియాంక, సౌస్ చెఫ మిస్టర్ చిన్ని దేవరాజు, ప్రత్యేక ఆకర్షణగా మిస్ కృష్ణవేణి నిలిచారు,కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ దాసరి నరేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట) : మహిళా సాధికారత కోసం పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ తరపున రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ ఆలమండ ఎల్లారావు పేర్కొన్నారు... శనివారం మొగల్రాజపురం లోని సిద్ధార్థ ఆడిటోరియంలో పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలు అంశాలకు సభ్యులు ఆమోదం తెలుపగా పీపుల్స్ గోల్డెన్ బాండ్ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సొసైటీ చైర్మన్ ఎల్లారావు మాట్లాడుతూ తమ సొసైటీ తరఫున ఇప్పటికే అనేకమంది రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు, విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు విద్యా రుణాలు కూడా అందజేశామని తెలియజేశారు. ముఖ్యంగా తమ సొసైటీ మహిళా సంక్షేమానికి ఎంతగానో పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు తమ సొసైటీ తరపున తక్కువ వడ్డీకి రుణాలు అందజేశామని తెలియజేశారు. పీపుల్స్ గోల్డెన్ బాండ్ మహిళలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలను ప్రజలకు రుణాల రూపంలో అందజేశామని త్వరలో మరిన్ని శాఖలు ఏర్పాటు చేసి ప్రజలకు రుణాలు అందించడమే తమ లక్ష్యమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణాజిల్లా మాజీ జడ్పీ చైర్మన్ గద్దె అనురాధ పేర్కొన్నారు. శనివారం మొగల్రాజపురం లోని ఒక హెూటల్లో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మాస్టర్ చెఫ్ పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం హైదరాబాద్ తదితరు ప్రాంతాలకు చెందిన మహిళా మణులు ఈ పోటీలలో పాల్గొని వారు తయారుచేసిన వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణా జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ గద్య అనురాధ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలు తయారుచేసిన వంటలను రుచి చూశారు. కాగా పోటీలలో గెలుపొందిన సునైనా జాస్మిన్ లకు మాస్టర్ చెఫ్ఫు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మహిళలు వంటగదికే పరిమితమయ్యే వారిని ప్రస్తుత ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మహిళా మండలి కోసం ప్రత్యేకంగా వంటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అన్ని సమపాలలో ఉంటేనే వంటలు రుచికరంగా ఉంటాయని, ప్రస్తుత పరిస్థితుల్లో చెఫ్పులకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. రౌండ్ టేబుల్ ఇండియా మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని తెలియజేశారు. తదనంతరం రౌండ్ టేబుల్ ఇండియా లేడీస్ సర్కిల్ ఏరియా చైర్ పర్సన్ డాక్టర్ శాంతి మాట్లాడుతూ రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో మహిళల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా మహిళలకు వంటల పోటీలు నిర్వహించామని మహిళలు ఎంతో ఆసక్తిగా ఈ పోటీలలో పాల్గొని రకరకాల వంటలను తయారుచేసి పోటీలో ప్రదర్శించారని చెప్పారు. తమ సమస్త ఆధ్వర్యంలో విద్యారంగ అభివృద్ధికి ఎంతగానో పెద్దపీట వేస్తున్నామని తరగతి గదులను నిర్మించడంతోపాటు, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్స్ కూడా నిర్మించామని తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ చెఫ్ ప్రోగ్రామ్ కన్వీనర్ ఐశ్వర్య, ఏరియా 9 చైర్ పర్సన్ డాక్టర్ శాంతి, చైర్ పర్సన్ సునయన, సభ్యులు డాక్టర్ ప్రశాంతి, అలేఖ్య కాట్రగడ్డ, కాట్రగడ్డ వినీత తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అండగా ఉంటుంది

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట): రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లక్షన్నర విలువ చేసే రోబోటిక్స్, ప్రొస్టాటిక్ లింబును రేగెళ్ళ అఖిల అనే అమ్మాయికి అందజేసే కార్యక్రమం సూర్యారావుపేటలోని హర్ష వ్యాక్స్యులర్స్ హస్పిటల్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ జాతీయ కార్యదర్శి రచిత్ బన్సల్ చేతుల మీదుగా అందజేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచిత్ బన్సల్ మాట్లాడుతూ విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన రేగెళ్ళ అఖిల ఇంటర్ తరువాత ఉద్యోగ నిమిత్తం రైలులో వెళ్తూ ప్రమాదశావత్తు కిందపడి రెండు కాళ్ళు కోల్పోయిందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను చూసి ఆమెకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం విద్యను ప్రోత్సాహించడమని అందులో భాగంగా 8 వేల పాఠశాలల తరగతులు దేశ వ్యాప్తంగా నిర్మించామన్నారు. అనంతరం డాక్టర్ శ్రీ హర్ష మాట్లాడుతూ ఈ రోబోటిక లింబు ద్వారా అఖిల సాదరణ జీవితాన్ని తిరిగి పొందుతుందన్నారు. రౌండ్ టేబులో ఇండియా ఏరియా సెక్రటరీ కౌశిక్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో లక్షన్నర విలువ చేసే పరికరాన్ని అందజేసామన్నారు. ఇటువంటి సమస్యలు ఉన్న వారికి సహాయం అందించేందుకు ఎప్పుడు ముందుంటామని స్పష్టంచేసారు.. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ శాఖ చైర్మన్ కీరట్ సింగ్, కార్యదర్శి శ్రీకర్, లేడీస్ సర్కిల్ ఏరియా చైర్ పర్సన్ కాకుమాను శాంతి తదితరులు పాల్గొన్నారు....

టేనర్ పేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): 47వ డివిజన్ టేనర్ పేటలోగల ఐజాక్ వీధి, జీవరత్నం వీధి, పురుషోత్తం వీధి నందు మెట్లు, కాలువలు, రిపేరు నిమిత్తం పాలడుగు సుధాకర్ ఇంటి వద్ద శంఖుస్థాపన కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 151 సచివాలయ కన్వీనర్లు తాండ్ర ఇంద్ర కుమార్, రెడపంగు క్రాంతి కుమార్, రాష్ట్ర ఎస్ సి సెల్ నాయకులు కామళ్ళ జోజి, డివిజన్ నాయకులు కామళ్ళ కిషోర్, పగిడిపల్లి పెద్ద పాండు, పొట్నూరి శివ, మరియు ఏ ఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ దుర్గారావు, విఎంసి అధికారులు పాల్గొన్నరు.

స్టెనో గ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణాజిల్లా న్యాయ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు 6 స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓసీ, ఓసీ(మహిళ), ఏసీ(లోకోమోటార్ డిజబిలిటీ), ఓసీ ఈడబ్ల్యూఎస్) బీసీ-ఏ, ఉస్సీ కేటగిరీల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. నెలకు రూ.18,500 వేతనం ఉంటుందని, వయస్సు 2023 జూలై 1 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలని, రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనలు మేరకు గరిష్ట వయోపరిమితి సడలింపు ఉంటుందని చెప్పారు. స్కిల్ టెస్ట్, మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేషన్, టైప్‌రైటింగ్, షార్ట్ హ్యాండ్ ధృవపత్రాలను దరఖాస్తుతో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, కృష్ణా, మచిలీపట్నంకు పంపాలని వివరించారు.

రాజ్యాంగాన్ని ఆచరించే వాళ్లను బట్టే వ్యవస్థలు ప్రభావితం :సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ అంకితభావంతో పని చేసిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ అనంతరం వారి యోగక్షేమాలు చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని ఏపి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి (మాజీ సీఎస్) ఎల్.వి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని రమాపంక్షన్ హాల్‌లో ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ జెండా అవిష్కరణ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మాజీ సీఎస్ మాట్లాడుతూ 70 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో ప్రస్తుత పెన్షనర్ల పాత్ర ఉద్యోగులుగా ఎంతో ఉంది అనాడు వ్యవస్థను కాపాడాలని తపనతో ఎంతో కష్టపడి పని చేశారు. నేడు ఉద్యోగులుగా పెన్షన్ ఇవ్వను ఐ.ఆర్ ఇంతే ఇస్తా అని చెప్పడానికి ప్రత్యేకమైన చట్టమేమైనా ఉందా,ఇవ్వను అని చెప్పడానికి మీరెవరు అని ప్రశ్నించారు. అంబెడ్కర్ ఎంత మంచి రాజ్యాంగాన్ని మనకు ఇచ్చారు. దాన్ని ఆచరించే వాళ్ళను బట్టి ఉంటుంది దాని ప్రభావం వ్యవస్థలను నడిపించడానికి ముందుకు వచ్చే వ్యక్తులు ప్రధానం అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు రాష్ట్ర ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరిస్తే మనం సాధించుకున్న స్వాతంత్ర్యం కోల్పోయినట్టే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలకు నిజం మాట్లాడే ధైర్యాన్ని,వ్యవస్థ కలిగించాలి ఇవాళ పనిచేస్తున్న ఉద్యోగులు ,మన సంతతే తప్పులు చేస్తే మనమే చెప్పాలి అయినా చేస్తే ఫలితం అనుభవిస్తారు అని హెచ్చరించారు. పెన్షనర్స్ తమ సమస్యలపైనే కాకుండా ప్రజా సమస్యలై కుడా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ అధికారం కోసం కాకుండా సమస్యలను పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని సూచించారు. మీ పార్టీకి మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. మరో అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ప్రభుత్వం రాగానే వెంటనే సిపియస్ రద్దు చేస్తానని, పెండింగ్ లో ఉన్న అన్ని డి.ఎ లను వెంటనే ఇచేస్తనని కళ్ళబొల్లి మాటలు చెప్పు అధికారం చేపట్టిన జగన్ మోహన్ రెడ్డి రివర్స్ పియార్సి ఇచ్చి ఇప్పటి వరకు మొత్తం 11 డి.ఎ లు పెండింగ్ పెట్టారని విమర్శించారు. ఈ నాలుగు సం..రాల కాలంలో ఒక్కసారి కూడా కౌన్సిల్‌లో కాలు పెట్టలేదన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులర్ చేస్తానని చెప్పిన జగన్ మాట మీద నిలబడలేదు మాట తప్పం, మడం తిప్పం అని చేప్ప జగన్ నిలబడలేదన్నారు. ఉద్యోగులను, పెన్షనర్స్, నిరుద్యోగులను మోసం చేసి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. మళ్ళీ పోరాటం చేస్తానని చెపితే అక్రమ అరెస్టులు కనీసం పర్మిషన్ కూడా ఇవ్వటం లేదు అదే వారి మీటింగులు అంటే ఆర్టీసీ బస్సులు పెట్టేస్తారు. ప్రభుత్వం విర్రవీగుతుంది ప్రజలు కచ్చితంగా అడ్డుకట్ట వేస్తారు అని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.సుబ్బారాయన్ మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఒక రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచనతో పెన్షనర్స్ పార్టీ పెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం మా పట్ల పూర్తిగా నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోంది పెన్షనర్ల ప్రయోజనాలను కాల రాస్తుందన్నారు. మా మెడికల్ బిల్లులు,సకాలంలో పెన్షన్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుంది,ఉద్యోగులను,పెన్షనర్లను పట్టించుకోరు, రైతులను పట్టించుకోరు,అఖరుకు నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా కళాశాలలు తయారయ్యాయి అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్ళుతున్నారు ఇది రాష్ట్రానికి మంచిది కాదన్నారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క తీవ్రమైన వరాషభా పరిస్థితుల్లో క్రాఫ్‌హాలిడె ప్రకటించి పక్క రాష్ట్రాలలో కులీలుగా పని చేయటానికి వెళ్ళుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 3 లక్షలకు పైగా ఖాళీ పోస్టులు ఉన్నాయి వాటిని భర్తీ చేయడం లేదు,రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టరు ఉన్న వాటిని తరిమి వేస్తారన్నారు. అసలు ప్రభుత్వం ఎం చేస్తోందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను సారా దుకాణాల్లో పని చేసే వారిలా మార్తి వేశారు. ఎవరైనా సమస్యలను చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి అందుబాటులో ఉండరు అని విషయాలకు మధ్యవర్తిగా ఉన్నవ్యక్తికి చెప్పుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో ఉందన్నారు. పెన్షనర్ల దూరదృష్టం ఐ ఆర్ పేరిట జీతాల్లో కోత పెట్టింది,రిటైర్ అయిన వాళ్లకు క్వాంటమ్ పెన్షన్ లో కోత పెట్టింది తమ జీవితంలో వైకాపా లాంటి దుర్మార్గ ప్రభుత్వాన్ని ఇప్పటివరకు చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.పెద్దన్న గౌడ్, మాజీఏపిఎన్జీవో అధ్యక్షులు జి.పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు ఎస్.మునియ్య, జి.రామస్వామి, కార్యదర్శి పి.రాజేంద్రప్రసాద్, బి.సత్యనారాయణ, కోశాధికారి టి.నాగబూషణం,తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో 'బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ'

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం 62 వ బూతు ఇస్లాం నగర్‌లో జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు , క్లస్టర్ ఇంచార్జ్ మోర్ల శివ, భూత్ ఇంచార్జ్ షేక్ సిలార్, ఎంపీటీసీ పైడిపాము స్వప్న , అంగన్వాడీ డోక్రా ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బావిశెట్టి కనకదుర్గ , మహమ్మద్ అమీర్ బేగ్ (జానీ), తెలుగు యువత నాయకులు వేముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

బేడ బుడగ జంగం హక్కుల కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా సిరిగిరి నాంచారయ్య

విశాలాంధ్ర-పెడన : బేడ (బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెడన 18వ వార్డు ఇందిరా కాలనీ బేడ (బుడగ)జంగం ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ కమిటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు అధ్యక్షతన శనివారం కృష్ణాజిల్లా బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా సిరిగిరి నాంచారయ్యను ఎన్నిక కృష్ణాజిల్లా బేడ బుడగ జంగం నాయకులు సభ్యులు ఆధ్వర్యంలోనియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మరియు కృష్ణాజిల్లా కుల పెద్దల సహకార బలంతో ప్రజల పక్షాన జిల్లా అధ్యక్షులు నిలిచి అపారమైన నమ్మకంతో విశ్వాసంతో జిల్లా అధ్యక్షులుగా సిరిగిరి నాంచారయ్యను ఎన్నిక చేయడం జరిగిందని ఈ బాధ్యత నిర్వర్తించడంలో రాష్ట్ర నాయకత్వం యొక్క సంపూర్ణ సహాయ సహకారాలు జిల్లా అధ్యక్షులకు ఉంటాయని యలమర్తి మధు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షులు సిరిగిరి నాంచారయ్య మాట్లాడుతూ నాకిచ్చిన ఈ జిల్లా అధ్యక్ష పదవి అలంకారం కాదు కానీ నేను ఈ బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అలాగే రాష్ట్ర నాయకులు యలమర్తి మధు నాయకత్వంలో బేడ బుడగ జంగా కులస్తులకు జిల్లాలో ఏ సమస్య వచ్చినా ప్రతి సమస్యను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకొని వచ్చి మరియు కులస్తుల ప్రతి సమస్యను తీర్చే విధంగా ముందుకు వెళతానని నా పదవికి న్యాయం చేసే విధంగా సహాయ సహకారాలు అందే విధంగా నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని రాష్ట్ర నాయకులు మధు మరియు కులస్తుల కుల పెద్దల ఆధ్వర్యంలో తెలియపరుస్తున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు సిరిగిరి వెంకటేశ్వరరావు, విభూది శ్రీనివాసులు, పస్తం దుర్గారావు, పస్తం వాకలయ్య ,పస్తం మహాలక్ష్ముడు, సంకుల శ్రీను, బైలపాటి తుకారాం, టేకుకొండ,పస్తం సుబ్బారావు, సిరిగిరి ఆనందరావు, కళ్యాణి కనకం, మోతే బిక్షం, పత్తి తిరుపతిరావు, మరియు బేడ (బుడగ) జంగం కుల పెద్దలు సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనం కింద పడి చిన్నారి మృతి

విశాలాంధ్ర-చల్లపల్లి : చెత్త సేకరణ ఆటో కింద పడి చిన్నారి బాలుడు మృతి చెందిన సంఘటన. చల్లపల్లి మండలం వక్కలగడ్డ లో చోటు చేసుకుంది . గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు నల్లగుల్ల నాంచారమ్మ మనుమడు రెండున్నర ఏళ్ల గరికే శ్యాం తన ఇంటి ముందు ఆడుకుంటూ ఆటో కింద పడ్డాడు. చేతిలో ఉన్న జామకాయ ఇంటి ముందు ఆగి ఉన్న ఆటో కింద పడటంతో బాలుడు ఆటో కిందకు వంగాడు. ఆటో డ్రైవర్ నాంచారయ్య చూడకుండా వాహనం నడపటంతో శ్యాం అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు హుటాహుటీన చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎంపీడీఓ చేకు చిన్న రాట్నాలు, సర్పంచ్ వల్లూరు ఉమా, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, టీడీపీ నేత తాతినేని సాయి, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి మృతదేహం పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.

మర్రివాడలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మర్రివాడలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రోటరీ అధ్యక్షులు సిహెచ్.టి.వెంకటెశ్వర రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం లో డా.,రవి కుమార్ (జనరల్ మెడిసిన్), డా.,, ఎల్.అనిత(దంతవైద్య) తొంభై మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ నాగ సుబ్రహ్మణ్యం గ్రామస్తులు వై.రాజేంద్ర ప్రసాద్ వై.శరత్ కుమార్ సిహెచ్.వెంకట అప్పారావు గుండె రమేష్ కె.సిపి.డిప్యూటి మేనేజర్ అమర్నాథ్ కె.సి.పి.సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు పై గిరిజనులు చైతన్యవంతులు కావాలి

విశాలాంధ్ర -పమిడిముక్కల: ఓటు హక్కు పై గిరిజనులు చైతన్యవంతులు కావాలని జిల్లా కోఆపరేటివ్ మరియు స్వీప్ నోడల్ అధికారి వి.వి.ఫణి కుమార్ అన్నారు. శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరంకిలాకు లో అత్యంత వెనుకబడిన గిరిజన తెగ(పివిటిజి) కు చెందిన చెంచు, గిరిజనులకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పొందే గిరిజనులందరు రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాలు మేరకు గిరిజనులు ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి డిప్యూటీ తహశీల్దార్ ఏసుపాదం బి.ఎల్.ఒ.పూజిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కిట్లను పంపిణీ చేసిన జేసీ సంపత్‌కుమార్



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలకు అవసరమైన క్రీడా పరికరాల కిట్లును జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పీ.సంపత్‌కుమార్ శనివారం స్థానిక జేసీ క్యాంపు ఆర్యాలయంలో జిల్లాలోని మండల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మైదానాలు సిద్ధం చేసి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్లు అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ అజీజ్ పాల్గొన్నారు.

ఐఎంఏ, వైడీఆర్ఎఫ్ సంయుక్త నిర్వహణలో

నేడు డయాబ్ ఎండో కాన్ 2023

- దయాబెటిస్, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి అత్యున్నత స్థాయి వైద్య సదస్సు
- ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ యలమంచి సదాశివరావు
- డయాబ్ ఎండో కాన్ 2023 పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా విశ్లేషించేందుకు డయాబ్ ఎండో కాన్ 2023 సదస్సు నిర్వహిస్తున్నట్లు యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్, ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆరిజన్ ఎండోక్రైన్ సెంటర్ లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత, డయాబ్ ఎండో కాన్ 2023 పోస్టర్లను ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ చలసాని ప్రమోద్, సెక్రటరీ డాక్టర్ అక్కినేని శివరామ్ తదితరులతో కలిసి డాక్టర్ సదాశివరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, ఈనెల 3వ తేదీ ఆదివారం నాడు నగరంలోని నోవోటెల్ హెూటల్లో డయాబ్ ఎండో కాన్ 2023 జరుగుతుందని వెల్లడించారు. డయాబెటిస్, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ అత్యున్నత స్థాయి వైద్య సదస్సుకు 25 మంది జాతీయ స్థాయి వైద్య నిపుణులు హాజరవుతున్నారని, దాదాపు 500 మంది వైద్య నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. సదస్సులో ఆధునిక చికిత్సా విధానాలు, నవీన ఔషధాల గురించి ఈ సదస్సులో చర్చిస్తామని చెప్పారు. వివిధ అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారని.. ముఖ్యంగా, ప్రస్తుతం ఆందోళనకర సంఖ్యలో పెరుగుతున్న ప్రీ డయాబెటిస్ కేసుల గురించి విశ్లేషించడంతో పాటు, మధుమేహం బారినపడకుండా యువతను అప్రమత్తం చేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం మన దేశంలో 10 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులున్నారని, మరో 13 కోట్ల మంది ప్రీ డయాబెటిస్ బారినపడ్డారని చెప్పారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో స్థూలకాయం వల్ల ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని, డయాబెటిస్ పేషెంట్లలో 85.2 శాతం మంది స్థూలకాయంతో బాధపడుతున్నారని అన్నారు. మధుమేహంతో పాటు స్థూలకాయంతో బాధపడుతున్న వారిని డయాబెటిసిటీ పేషెంట్లుగా వ్యవహరిస్తున్నామని, సదరు పేషెంట్లు శరీర బరువును తగ్గించుకుంటే అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చని చెప్పారు. బరువు తగ్గితే షుగర్ వ్యాధిని తిప్పికొట్టవచ్చని డాక్టర్ సదాశివరావు తెలిపారు. సదస్సులో భాగంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.రావుకు గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. మధుమేహం, ఎండోక్రైనాలజీలకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ఆధునిక చికిత్సా విధానాలను ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావడమే లక్ష్యంగా డయాబ్ ఎండో కాన్ 2023ను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సదాశివరావు పునరుద్ఘాటించారు. ఈ మీడియా సమావేశంలో ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ చలసాని ప్రమోద్, సెక్రటరీ డాక్టర్ అక్కినేని శివరామ్, వైడీఆర్ఎఫ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి హిమన, సెక్రటరీ డాక్టర్ వై. ఐశ్వర్య, జాయింట్ సెక్రటరీ డాక్టర్ వై. అమూల్య పాల్గొన్నారు.

నగరంలో కుక్కల బెడదను అరికట్టండి

52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి చంటి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేసన్ : నగరంలో కుక్కల బెడదను అరికట్టేందుకు ఆపరేషన్లు చేయాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు నగర పాలక సంస్థ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం వీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కల స్వైర విహారం ఎక్కువగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా చేరి ప్రజలను గాయపర్చటంతో పాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. పట్టపగలు కూడా చిన్నారులు, పెద్దలపై దాడిచేసి గాయపరుస్తున్నాయని, ఈ సమస్య పరిష్కారం కావాలంటే కుక్కల సంతానోత్పత్తి జరగకుండా నగర పాలక సంస్థ ఆపరేషన్లు చేస్తే వాటి పునరోత్పత్తి తగ్గి ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయని కమిషనర్‌కు వివరించారు.

ఓటర్ సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేసన్ : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. నగరంలో జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ బిషప్ హాజరయ్యా స్కూల్‌లోని 190 నుండి 197 పోలింగ్ కేంద్రాలు, రైల్వే ఫంక్షన్ హాల్‌లోని 155 పోలింగ్ కేంద్రాలను కమిషనర్ శనివారం పరిశీలించారు. 80 సెంట్రల్ నియోజకవర్గం ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అయిన నగర పాలక సంస్థ కమిషనర్, ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ కార్యక్రమం శని, ఆదివారాల్లో జరుగుతున్న సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు, బీఎల్ఎల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల లిస్టులు, మ్యాపులను బీఎల్:వోలు తమ వద్ద ఉంచుకుని సవరణ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 1 నుండి 257 పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఈ రెండు రోజులు బూత్ లెవెల్ అధికారి ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, స్థానిక ప్రజలు సంబంధిత పోలింగ్ స్టేషన్లుకు వెళ్లి ఓటర్ జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. కొత్త ఓటర్గా నమోదు చేసుకోవాలన్న ఓటర్ జాబితాలో తప్పులు, మరణించిన, వేరే ప్రదేశాలకు మారిన సంబంధిత ఫారంను పూర్తిచేసి బూత్ లెవెల్ అధికారికి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.